ల్లల్ని తీసుకువచ్చి అందరికీ పరిచయం చేసారు. చివర్లో తన తరఫున లక్ష రూపాయల విరాళాన్ని ఆశ్రమానికిచ్చారు. విషయం జీర్ణించుకోవడానికి అందరికీ కొన్ని క్షణాలు పట్టింది. వెంటనే ఆ ప్రాంతం అంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

ప్రస్తుతం సమాజంలో పిల్లలు లేని వారు లక్షలు ఖర్చుపెట్టైనా కృత్రిమ పద్ధతులలోనైనా సంతానాన్ని పొందాలనుకుంటున్నారు. అలాంటిది కొడుకుండి కూడా యిద్దరు ఆడపిల్లల్ని దత్తత తీసుకుని ఆశయాలు చెప్పడమే కాదు, చేసి చూపించటంలోనూ నేనెప్పుడూ ముందే వుంటాను అని నిరూపించుకున్న డి.ఇ.ఓ.గార్ని చూసి 'అనవసరంగా ఆయన్ని అనుమానించామే!' అని చాలామంది బాధపడ్డారు.

చేసే పనులవలనే ఒక మనిషి మహామనీషిగా మారుతాడు. పదిమందిలో ఒక మంచి గుర్తింపు పొందుతాడు.

**-డి. స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)**

# అసలు రహస్యం

**ప్రతిరోజూ సాయంత్రం అయిదున్నర అయ్యేసరికల్లా, అతను ఆ సెంటర్లోని రంగయ్య కిళ్ళీషాపు వద్ద నిలబడి ఉండటం నేను సుమారు ఇరవై రోజుల నుండి చూస్తున్నాను.**

నేను అంత ఖచ్చితంగా టైమ్ చెప్పటానికి కారణం నేను ఆఫీసు వదిలి బయలుదేరే సమయం అదే కనక. అతను అక్కడ సరిగ్గా ఒక్క గంట మాత్రమే ఉంటాడు. అతను అయిదున్నరకన్నా కనీసం రెండు నిమిషాలు ముందుగా రావటం కానీ, ఆరున్నర తరువాత రెండు నిమిషాలు ఆలస్యంగా వెళ్ళటం కానీ నేనింతవరకు చూడటం తటస్థించలేదు. వాచీ కనక ఆగిపోతే, అతను అక్కడికి వచ్చే సమయాన్ని బట్టికానీ, వెళ్ళే సమయాన్ని బట్టికానీ టైము కరెక్టు చేసుకోవచ్చు. ఆలిండియా రేడియో జోలికి పోకుండానే అనిపించేది నాకు.

నేను అతనిని అంత ఇదిగా చూడటానికి కారణం ఆ మనిషి తాలూకు ఆరడుగుల బలమైన విగ్రహం, అందమైన గుండ్రని ముఖం, ఒత్తుగా దట్టంగా గుబురుగా వున్న మీసాలు, నవ్వినప్పుడు కనబడే గుబురులోని అందమైన తెల్లటి కుందేళ్ళ వరసలాంటి పలువరస. ఇవికాక, అతను వేసుకునే అతి ఖరీదైన బట్టలు, వీటన్నిటినీ డామినేట్ చేస్తూ అతను అక్కడ, ఆ కిళ్ళీషాపు వద్ద పార్క్ చేసే అందమైన డాడ్జి కారూనూ. ఇవన్నీ కలిసి అతనిని అంత పరీక్షగా చూసేటట్టు చేశాయి నన్ను.

నేనే కాదు.. నిజం చెప్పాలంటే, హైదరాబాదు కొత్తగా వచ్చిన వాళ్ళు చార్మినార్, టాంక్‌బండ్, సాలార్‌జంగ్ మ్యూజియమ్ తప్పక ఎలా చూస్తారో, అలాగే ఆ దారినపోయేవాళ్ళు అతనిని ఒక్కసారి అయినా చూడకుండా పోరంటే అదేమీ అతిశయోక్తికాదు. మరి ఆ విగ్రహం అలాంటిది.

అతనిని చూసిన అమ్మాయిలు, తెలుగు, హిందీ, హాలీవుడ్‌ల మిలాయింపులో చేసిన హీరోలా ఎంత చక్కగా ఉన్నాడో అని అనుకోకుండా ఉండరు.

అతని పెర్సనాలిటీ చూసి, యువకులు అసూయచెందక మానరు.

అతనిని చూసిన అర్భకులు, తమ శరీరాను ఆ భారీ విగ్రహంతో బేరీజు వేసుకుంటూ దిగులుగా నడిచిపోతారు.

ఎవ్వరైనా ఫోటోగ్రాఫర్ చూడటం తటస్థిస్తే-ముఖం ఫోటోజెనిక్‌గా ఉంది, ఒక ఫోటో ఎన్లార్జి చేసి, స్టూడియోకు వేలాడదీస్తే బాగుండును-అనుకొంటాడు.

అతని నవ్వు చూసిన ఏ పేరు మోసిన కవి అయినా సరే- ఇకముందు ఆడవాళ్ళ నవ్వుల్ని పువ్వులతో పోల్చటం మానేసి, మగాళ్ళ నవ్వుల్ని ముత్యాలసరాలతోనూ, బొండుమల్లెలతోనూ పోలుస్తూ, అర్జెంటుగా ఒక అరడజను పద్యాలు వ్రాసుకు చక్కాపోతారు-అనుకున్నాను. అతను నవ్వినప్పుడు మీసాలు ఎన్లార్జయి మరింత అందంగా ఉంటాడు. బుగ్గల వద్ద ఎత్తుగా ఉబికి, గడ్డంక్రింద చిన్న నొక్కు ఏర్పడుతుంది. నేనుప్రతి రోజూ అతనిని చూడటం ఒక పనిగా పెట్టుకున్నాను. కనక అతని హావభావాలంత స్పష్టంగా చూడగలిగాను.

ప్రతిరోజూ అతను రంగయ్య కిళ్ళీషాపు వద్ద నిలబడి, విలాసంగా సిగరెట్ కాలుస్తూంటాడు. ఆదివారం మాత్రం మనిషి కనబడడు. అతన్ని అలా కొన్ని రోజులు చూశాక- నాకే ఒక రకమైన 'అల్సర్' లాంటి అసూయ బయలుదేరింది. అందుకు అతని ఖరీదైన బట్టలు, కారు, విలాస జీవితం కారణాలు అనుకుంటాను. దేశంలో నాలాంటి కష్టపడేవాళ్ళెందరున్నారో, అంతకు రెట్టింపుగా అలా సుఖపడేవాళ్ళున్నారన్న బాధ!

అసలు భగవంతుడికి న్యాయం అనే మాటకు అర్థం తెలియదు. తెలిసి ఉంటే అందర్నీ ఒకేలా సృష్టించి, వారికి పేద, గొప్ప అన్న రెండు వర్గాలు సృష్టించడు అనిపించింది నాకు. బహుశా అతను నాలా కష్టపడే ఉద్యోగాలేమీ చెయ్యటం లేదేమో! అయినా నా పిచ్చికానీ, ఊరంతా కారేసుకు తిరిగే మనిషి ఉద్యోగాలు చెయ్యడు! ఉద్యోగాలిస్తాడనుకున్నాను. ఏది ఏమైనా, అతనితో నాకు వీసమంత సంబంధం కూడా లేకపోయినా, అతనిని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం బయలుదేరింది నాలో. అందువల్ల నాకు ఒరిగేదేమీ లేదని తెలిసినా! అందుకు మార్గం కిళ్ళీషాపు రంగయ్య ఒక్కడే అతని తెలుసు. కనక వచ్చే ఆదివారం అతనిని గురించి విషయాలు సేకరించాలనుకున్నాను.

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. ''గురూ! మాటనీకి వెళదాం'' అంటూ బాణంలా రూములోకి దూసుకువచ్చాడు నా కొలీగ్ రాజారావు. చదరంగం పేరుతో అతన్ని రూములో రెండు గంటలు ఆపి, ఇద్దరం బయటికి వచ్చి, కాఫీ తాగి, రంగయ్య కిళ్ళీషాపు దగ్గరికి చేరుకున్నాము.

నేను రెండు మీఠా పాన్‌లకి ఆర్డరిచ్చి, రంగయ్యను అడిగాను మాటల మధ్య..రోజూ కారు మీద వచ్చి ఇక్కడ ఒక గంట ఉండి వెళ్ళే మనిషి ఎవరని?

అందుకు రంగయ్య చెప్పిన వివరాలివి:

ఆ భారీ విగ్రహం పేరు మోహన్- అతను ఒక పెద్ద కంపెనీ మానేజర్ కారుడ్రైవరుట. జీతం మూడు వేలట. సంవత్సరానికి ఆరు జతల అందమైన బట్టలిస్తారట, బూట్లతో సహా! అతను రోజూ ఇక్కడికి రావటానికి కారణం కిళ్ళీషాపుపక్కనే ఉన్న సందులో ఒక లెక్చరర్ ఉన్నాడుట. అతని వద్ద ట్యూషన్‌కి గాను, మానేజరుగారి అమ్మాయి ఆ టైంకి కారులో వచ్చి, తిరిగి కారెక్కి, వెళ్ళిపోతుందట. కారు ఆ సందులో పట్టదుగనుక-ఇక్కడ ఆపుజేసి నిలబడతాడుట!

మేమిలా మాట్లాడుతూ ఉండగానే ఆ భారీ విగ్రహం- సారీ మోహన్ వచ్చాడక్కడికి-ఖరీదైన బట్టల్లో కాదు-డాడ్జికారులో అంతకన్నా కాదు. కేవలం మాసిపోయిన కాకీ లాగుతో, భుజం వద్ద చిరిగిన తెల్లటి చొక్కాతో, ఒక్కరోజు మాసిన గెడ్డంతో, నిప్పులు కురిసే..కళ్ళతో, గుప్పున ఎగిసే సారావాసనతో.

నేనూ, రాజారావు వెనుదిరిగాము రూముకి-నేను నడుస్తూ ఆలోచిస్తున్నాను.

అతనికంటే నేనే నయం. ఆ క్షణం వరకూ అతనిపై అర్థంలేని అసూయపేరుకు పోయిన నాలో, ఆ క్షణం నుండి జాలి చోటు చేసుకుంది ఆ స్థానంలో.

ఇప్పుడు మాత్రం భగవంతుడు ఏర్పరిచిన భేదాల గురించి ఆలోచించలేదు నేను, అసలు రహస్యం తెలిశాక.

**-బద్దిగం పాండురంగారెడ్డి (కరీంనగర్)**